సాక్షి విశాఖపట్నం

బుధవారం । 12 ఏప్రిల్ । 2023



హలీం..రుచికి సలాం

రంజాన్ మాసం ప్రారంభమైందంటే చాలు.. ఎన్నో పోషక విలువలున్న హలీం అందరికీ గుర్తుకొస్తుంది.

8లో



కేజీహెచ్ ఎస్టీ సెల్ ప్రక్షాళన

ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజీహెచ్‌లోని ఎస్టీ సెల్ ప్రక్షాళనకి అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది.


8లో



బాలికల చదువుకు బాసట

బాలికా విద్యను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన కేజీబీవీల ద్వారా మెరుగైన ఫలితాలు కనిపిస్తున్నాయి.

11లో



న్యూస్‌రీల్

27 నుంచి ఇండస్ట్రియల్ కమ్ బిజినెస్ ఎక్స్‌పో



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పరిశ్రమల కేంద్రం జీఎం గణపతి, పారిశ్రామికవేత్తలు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ డీ-బ్లాక్‌లోని ఎం/ఎస్ గోపాల్ ఇంజినీరింగ్, సరిపల్లి గ్రాండ్, ప్లాట్ నంబర్ 224 డీలో ఈ నెల 27, 28, 29వ తేదీల్లో ఇండస్ట్రియల్ కమ్ బిజినెస్ ఎక్స్‌పో-2023 నిర్వహిస్తున్నట్లు ఫ్లవరిష్ క్రియేషన్ అధినేత డి.వినోద్ తెలిపారు. ఎక్స్‌పో-2023 బ్రోచర్‌ను జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం సీహెచ్.గణపతి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ డీఐసీ, ఎస్ఆర్‌డీసీల సాయంతో ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలకు ఈ ఎక్స్‌పో మంచి అవకాశమన్నారు. పారిశ్రామికవేత్తలు వై.సాంబశివరావు, పి.ప్రభాకర్, డి.అశోక్ పాల్గొన్నారు.

సెంట్రల్ జైలు డీఎస్-2గా రతన్‌రాజ్

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్(డీఎస్)-2గా బి.రతన్‌రాజ్ విధుల్లో చేరారు. జైలు సూపరింటెండెంట్‌కు సహాయకులుగా గతేడాది వరకు ఇద్దరు డిప్యూటీ సూపరింటెండెంట్లు ఉండేవారు. వీరిలో ఎం.వెంకటేశ్వరరావుకు పదోన్నతి కల్పించి ఇదే జైలుకు అడిషనల్ సూపరింటెండెంట్‌గా నియమించారు. అప్పటి నుంచి మరో డీఎస్‌గా రామచంద్రరావు ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. ఏడాదిగా ఖాళీగా ఉన్న ఈ పోస్టును ఇటీవలే భర్తీ చేశారు. విజయవాడ జైలులో జైలర్‌గా పనిచేస్తున్న బి.రతన్‌రాజ్‌కు డీఎస్‌గా పదోన్నతి కల్పించి విశాఖ సెంట్రల్ జైలుకు బదిలీ చేశారు. రెండు రోజుల కిందట ఆయన బాధ్యతలు స్వీకరించారు. రతన్‌రాజ్ గతంలో ఇక్కడ డిప్యూటీ జైలర్‌గా పనిచేశారు. ఐదేళ్ల కిందట ఆయన జైలర్‌గా పదోన్నతి పొంది విజయవాడకు బదిలీ అయ్యారు. మళ్లీ డీఎస్‌గా పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

నేడు 30 మందికి నియామకపత్రాల అందజేత

తాటిచెట్లపాలెం: రోజ్‌గార్ మేళాలో భాగంగా దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన సుమారు 71 వేల మంది అభ్యర్థులకు గురువారం ప్రధాని మోదీ వర్చువల్‌గా నియామక పత్రాలు అందజేయనున్నారు. దేశవ్యాప్తంగా రైల్వేలో 15 వేల మంది ఎంపికవ్వగా.. ఇందులో వాల్తేర్ డివిజన్ పరిధిలో 30 మంది ఉన్నారు. పోర్టు కళావాణి ఆడిటోరియంలో గురువారం ఉదయం 10.30 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో 30 మందికి నియామక పత్రాలు అందజేస్తామని వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

14 నుంచి ఈకోర్స్ క్రీడాపోటీలు

విశాఖ స్పోర్ట్స్: ఈకోర్స్ అంతర విభాగాల క్రీడా పోటీలు ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్నాయి. 11 అంశాల్లో జరగనున్న ఈ పోటీల్లో 19 జట్లు పోటీపడుతున్నాయి. పోటీలకు సంబంధించి పోస్టర్‌ను డీఆర్‌ఎం అనూప్ కుమార్ సత్పతి మంగళవారం విడుదల చేశారు. ఈకోర్స్ రైల్వే పరిధిలోని డివిజన్లు ఈ పోటీల్లో పాల్గొనున్నాయి.

ఎయిర్ కార్గోకు రైట్ రైట్!



కొన్నాళ్లుగా విమానాశ్రయంలో నిలిచిన సరకు రవాణా

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎయిర్‌కార్గో రవాణాకు మార్గం సుగమం అయింది. విమానాశ్రయాల్లో నిర్దేశిత నిపుణులైన స్క్రీనర్లు లేని కారణంగా విశాఖ, విజయవాడ సహా దేశంలోని తొమ్మిది ఎయిర్‌పోర్టుల్లో జనవరి ఒకటి నుంచి ఎయిర్ కార్గో రవాణాకు బ్రేకులు పడిన సంగతి తెలిసిందే. ఈ విమానాశ్రయాల్లో బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) సరకు రవాణాను నిలిపివేసింది. ఇన్నాళ్లూ ఆయా విమానయాన సంస్థలే కార్గో స్క్రీనింగ్ వ్యవహారాలు చూసుకునేవి. ఇటీవల ఆ బాధ్యతలను బీసీఏఎస్ పర్యవేక్షిస్తోంది. భద్రతా కారణాల దృష్ట్యా విమానాశ్రయాల్లో బీసీఏఎస్ నిబంధనలకు అనుగుణంగా నియమితులైన స్క్రీనర్లతోనే సరకు తనిఖీలు చేపట్టడం తప్పనిసరి చేసింది. వీటిని ఇప్పటికీ అమలు చేయని విమానాశ్రయాల్లో కార్గో బుకింగ్, రవాణాను నిలిపివేస్తూ బీసీఏఎస్ నిర్ణయం తీసుకుంది. ఇతర ఎయిర్‌పోర్టుల నుంచి కార్గో దిగుమతికి అభ్యంతరం చెప్పకుండా సరకులను రవాణా చేయడాన్ని ఆపింది. గతంలో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి స్పైస్ జెట్ సంస్థ ప్రత్యేకంగా ఒక కార్గో విమానాన్ని నడిపేది. కోవిడ్ ప్రభావంతో దానిని రద్దు చేసింది. ప్రస్తుతం ఈ ఎయిర్‌పోర్టు నుంచి సరకు రవాణాకు ప్రత్యేకంగా కార్గో విమానాలు నడవడం లేదు. ఇన్నాళ్లూ పాసింజరు విమానాల్లో వివిధ ప్రాంతాలకు కార్గో రవాణా జరుగుతోంది.

కార్గో రవాణాకు లైన్‌క్లియర్

విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి రోజుకు 80 వరకు పౌర విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటి ద్వారా నెలకు సగటున 300 టన్నుల సరకు రవాణా జరుగుతోంది. వీటిలో వైద్య పరికరాలు, అత్యవసర మందులు, రక్త పరీక్షల నమూనాలు, ఫార్మా, మత్స్య ఉత్పత్తులు, టెక్స్‌టైల్ వంటివి ఉన్నాయి. 45 రోజులుగా ఈ విమానాశ్రయం నుంచి కార్గో రవాణా నిలిచిపోవడంతో సంబంధీకులు రోడ్డు, రైలు మార్గాల్లో తమ సరకు/ఉత్పత్తులను పంపిస్తున్నారు. మరీ అత్యవసరమైతే తేలికైన వస్తువులు, సరకులు, మందులు, రక్త నమూనాలు వంటి వాటిని విమాన టిక్కెట్టు బుక్ చేసుకుని తమ వెంట తీసుకెళ్లి వస్తున్నారు. ఇలా రవాణా చేసే సమయంలో ఆక్సిజన్ సరిగా అందక పెద్ద ఎత్తున రొయ్య పిల్లలు చనిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరిలో విశాఖ విమానాశ్రయం నుంచి రొయ్య పిల్లలను రవాణా/ఎగుమతులకు అనుమతులిస్తూ పౌర విమానయానశాఖ జాయింట్ డైరెక్టర్ అవధేష్ ప్రతాప్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో విశాఖతో పాటు విజయవాడ విమానాశ్రయం నుంచి కూడా ఇండిగో సంస్థ ద్వారా ఎయిర్ కార్గోకు లైన్ క్లియర్ చేస్తూ త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నట్టు విమానాశ్రయ వర్గాలు తెలిపాయి.

నేడు డీఎస్సీ-98 అభ్యర్థులకు కౌన్సెలింగ్

- అంగీకారపత్రాల స్వీకరణ
- ఉమ్మడి విశాఖ జిల్లాలో పోస్టింగ్‌లు



అంగీకారపత్రాలను ఇస్తున్న అభ్యర్థి

విశాఖ విద్య: డీఎస్సీ-98 అభ్యర్థులకు ఉపాధ్యాయులుగా నియామక పత్రాలను అందించేందుకు సర్వం సిద్ధమైంది. జాబితాలో పేర్లు ఉన్న అభ్యర్థుల నుంచి మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారులు అంగీకార పత్రాలను స్వీకరించారు. విద్యాశాఖ కమిషనరేట్ నుంచి ఆదేశాల మేరకు సిద్ధం చేసిన జాబితాలో 355 మంది ఉద్యోగాలకు అర్హులుగా లెక్క తేలారు. వీరందరికీ బుధ, గురువారాల్లో కౌన్సిలింగ్ నిర్వహించేలా షెడ్యూల్ సిద్ధం చేశారు.

నేడు 1 నుంచి 200 వరకు..

జాబితాలో 1 నుంచి 200 నంబర్లు వరకు పేర్లు ఉన్న అభ్యర్థులకు బుధవారం, 201 నుంచి 355 వరకు గురువారం కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని జిల్లా విద్యాశాఖాధికారులు వెల్లడించారు. ఈ మేరకు డీఈవో కార్యాలయ నోటీసు బోర్డులో వివరాలు ఉంచారు.

మూడు జిల్లాల్లో పోస్టింగ్‌లు

విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని పాఠశాలల్లో వీరిని నియమించనున్నారు. 20 నుంచి 30 మధ్య విద్యార్థులు ఉన్న పాఠశాలల వివరాలను ఎంఈవోల నుంచి సేకరించారు. అదే విధంగా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో, సీఆర్పీలు అవసరమైన చోట్ల డీఎస్సీ-98 వారిని నియమించేలా ఖాళీల జాబితాను జిల్లా విద్యాశాఖాధికారులు సిద్ధం చేశారు.

355 మందికి పిలుపు : డీఎస్సీ-98లో ఉమ్మడి అప్పటి ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో 6,190 మంది అభ్యర్థులు పరీక్ష రాయగా, ఇందులో 2,453 మంది ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. న్యాయపరమైన వివాదాలతో నియామకాలకు అప్పట్లో బ్రేక్‌పడింది. వీరి గురించి పాలకులెవ్వరూ పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చొరవతోనే ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి లైన్ క్లియర్ అయింది. ఈ నేపథ్యంలో గత ఏడాది అక్టోబర్‌లో నిర్వహించిన సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌కు 423 మంది హాజరై, ఉద్యోగాల్లో చేరుతామని అంగీకర పత్రాలను విద్యాశాఖాధికారులకు అందజేశారు. 13-03-2023 తేదీ కటాఫ్‌గా తీసుకొని 60 ఏళ్ల పదవీ విరమణ వయస్సును నిర్ధారించి, ఉద్యోగాల్లోకి తీసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తాజాగా అర్హత గల 355 మందిని ఎంపిక చేసి, కౌన్సెలింగ్‌కు పిలిచారు. కాగా వీరిలో ఇద్దరు అభ్యర్థులకు 60 ఏళ్లు నిండిపోవటంతో ఏం చేయాలనే దానిపై ఉన్నతాధికారులకు నివేదించారు.

నేడు సీపీగా త్రివిక్రమ్‌వర్మ బాధ్యతలు



పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ



డీసీపీ వాసన్ విద్యాసాగర్‌నాయుడు

దొండపర్తి: నగర నూతన పోలీస్ కమిషనర్‌గా సి.ఎం.త్రివిక్రమ్ వర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటివరకు సీపీగా విధులు నిర్వర్తించిన సిహెచ్.శ్రీకాంత్ సీఐడీ ఐజీగా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో గుంటూరు రేంజ్ ఐజీగా ఉన్న త్రివిక్రమ్ వర్మను విశాఖ సీపీగా ప్రభుత్వం నియమించింది. దీంతో ఆయన బుధవారం ఉదయం 9 గంటలకు బాధ్యతలు తీసుకోనున్నారు. అలాగే డీసీపీ(లా అండ్ ఆర్డర్)గా వాసన్ విద్యాసాగర్‌నాయుడు కూడా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు ఇక్కడ డీసీపీగా ఉన్న సుమిత్ సునీల్ గరుడ్ ఎస్ఐబీకి ఎస్పీగా స్థానచలనం కలిగింది. ఈయన స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా ఉన్న వాసన్ విద్యాసాగర్‌నాయుడు విశాఖ డీసీపీగా బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

సీపీ శ్రీకాంత్‌కు ఘనంగా వీడ్కోలు

ఏడాది పాటు విశాఖ సీపీగా బాధ్యతలు నిర్వర్తించిన సిహెచ్.శ్రీకాంత్‌కు పోలీస్ అధికారులు, సిబ్బంది ఘనంగా సెండాఫ్ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ మైదానంలో మంగళవారం ఉదయం ఆయన గౌరవ వందనం సమర్పించారు. అలాగే ఏడాది కాలంలో ఆయన చేపట్టిన సంస్కరణలు, వాటి ద్వారా వచ్చిన సత్ఫలితాలను అధికారులు కొనియాడారు.

బైజూస్ పాఠ్యాంశాలపై అవగాహన అవసరం

విశాఖ విద్య: బైజూస్ పాఠ్యాంశాలపై ఉపాధ్యాయులు అవగాహన పెంపొందించుకోవాలని ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ మాణిక్యంనాయుడు అన్నారు. ట్యాబ్‌ల వినియోగం, పాఠ్యాంశాల బోధనపై ఉపాధ్యాయులకు మంగళవారం ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు బోధన చేసే 5,259 మంది ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొన్నారు. ప్రభుత్వ డైట్ కాలేజీ అధ్యాపకులు రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు. డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యంనాయుడు మాట్లాడుతూ బైజూస్ కంటెంట్ వల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దీనిని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు నైపుణ్యత కలిగి ఉండాలన్నారు. ట్యాబ్‌లకు తరచూ సాంకేతిక సమస్య ఉత్పన్నమవుతున్నందున వీటి వినియోగంపై తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్, విద్యా కార్యదర్శికి ట్యాబ్‌ల మరమ్మత్తుల బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు.

సీఎం జగన్ పాలనపై 'పూలే' ముద్ర

- టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు



పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి. చిత్రంలో మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ, రవీంద్ర, ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, ముత్తంశెట్టి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు తదితరులు

సాక్షి, విశాఖపట్నం: అణగారిన వర్గాల కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి వై.వి.సుబ్బారెడ్డి, పంచకర్ల పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పూలేను ఆదర్శంగా తీసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. బీసీలు, మహిళలకు పరిపాలనలో, సంక్షేమ పథకాలు అందించడంలో అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు వెల్లడించారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా బీసీలకు అత్యధికంగా పదవులిచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని పంచకర్ల అన్నారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ, వరుదు కల్యాణి, పి.రవీంద్రబాబు, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాస్, తిప్పల నాగిరెడ్డి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, నియోజకవర్గ పరిశీలకులు చింతలపూడి వెంకట రామయ్య, జి.వెంకటేశ్వరరావు, చొక్కాకుల వెంకటరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు జాన్ వెస్లీ, పల్లా చినతల్లి, కె.వి.బాబా, ఆళ్ల కృష్ణ, బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్, ముఖ్య నాయకులు కొండా రాజీవ్ గాంధీ, వుడా రవి, అల్లంపల్లి రాజబాబు, మంత్రి రాజశేఖర్, ఐ.హెచ్ ఫరూఖీ, మొల్లి అప్పారావు, ద్రోణంరాజు శ్రీవత్సవ్, పేర్ల విజయ చంద్ర, నడింపల్లి కృష్ణంరాజు, సతీష్ వర్మ, పేడాడ రమణి కుమారి, జోనల్ ఇన్‌చార్జిలు సునీల్, మారుతీప్రసాద్, బి.పద్మావతి, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు అడ్డాల కృపాజ్యోతి, అప్పన్న, బోని శివరామకృష్ణ, మన్యాల శ్రీనివాస్, బొండా ఉమామహేశ్వరరావు, కార్పొరేటర్లు అల్లు శంకరరావు, రెయ్యి వెంకట రమణ, అక్కరమాని రోహిణి, శశికళ, జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యులు ఎండీ షరీఫ్, సేనాపతి అప్పారావు, యతిరాజులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో ముగ్గురి అరెస్టు

- చోరీ సొత్తు స్వాధీనం
- నిందితులను పట్టుకున్న పోలీసులకు అభినందన



వివరాలు వెల్లడిస్తున్న నగర క్రైం డీసీపీ గంధం నాగన్న

అల్లిపురం: వివిధ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని నగర పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి బంగారు ఆభరణాలు, వివిధ వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో నగర క్రైం డీసీపీ గంధం నాగన్న విలేకరులకు వివరాలు వెల్లడించారు.

పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో..

మారికవలస, రామదుర్గ విల్లా-26లో నివసిస్తున్న చిట్టూరి సాయికృష్ణ ఈ నెల 9వ తేదీన విజయనగరం జిల్లా, గజపతినగరం నుంచి వచ్చి ఇంట్లో నిద్రకు ఉపక్రమించాడు. మరుసటి రోజు ఉదయం 6 గంటలకు నిద్రలేచి చూసేసరికి తన మొబైల్ కనిపించలేదు. కొన్ని వస్తువులు తన తల్లి పడకగది నేలపైన, ఇంటి మెట్లపైన పడి ఉండడాన్ని గమనించాడు. మెయిన్ డోర్ కూడా తెరిచి ఉంది. మూడు ఆండ్రాయిడ్ ఫోన్లు, ఒక కెనాన్ కెమెరా, నాలుగున్నర తులాల బంగారు గొలుసు కనిపించకుండా పోయినట్లు గుర్తించాడు. వెంటనే పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడు విజయనగరం జిల్లా, డెంకాడ మండలం, గొండయ్యపాలానికి చెందిన ఎర్నింటి కృష్ణబాబుగా గుర్తించారు. కృష్ణబాబును పీఎంపాలెంలో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఒక ద్విచక్ర వాహనం కేసులో నిందితుడు. రాత్రిపూట తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నాడు.

ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో...

శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం, జన్నాగాయ్ గ్రామానికి చెందిన గణప లక్ష్మణరావు ఎంవీపీ సెక్టార్-9లోని అతిథి ఇన్ హాస్టల్‌లో ఉంటున్నాడు. అతడు చెడు వ్యసనాలకు బానిసై ఖర్చుల కోసం దొంగతనాలకు పాల్పడుతున్నాడు. మార్చి 28న అప్పుఘర్‌లో లక్ష్మణరావుకు పరిచయం ఉన్న కోనాడ ప్రమీల ఇంటికి వెళ్లాడు. అక్కడ మూడున్నర తులాల బంగారం గొలుసు దొంగలించాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎంవీపీ క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని వాసవాని పాలెం వద్ద ఈ నెల 6వ తేదీన అదుపులోకి తీసుకున్నారు. కొటక్ మహీంద్రా బ్యాంక్‌లో తాకట్టు పెట్టిన బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

త్రీటౌన్ పరిధిలో..

మంగాపురం మసీదు ప్రాంతానికి చెందిన ఏజీ విజయలక్ష్మి ఈ నెల 7వ తేదీ ఉదయం 5.15 గంటల సమయంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో వాకింగ్ చేస్తున్నారు. ఆ సమయంలో నంబర్ ప్లేట్‌లేని ద్విచక్రవాహనంపై వచ్చి ఓ వ్యక్తి ఆమె కంట్లో కారం పొడి చల్లి మెడలో నల్లపూసల దండను లాక్కొనే ప్రయత్నం చేశాడు. పెనుగులాటలో మూడు గ్రాముల దండ విజయలక్ష్మి వద్ద ఉండిపోగా.. మరో మూడు గ్రాముల పగడాల లాకెట్టు నిందితుడు లాక్కొనిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన త్రీటౌన్ క్రైం పోలీసులు, సీసీఎస్ పోలీసులు నిందితుడ్ని సాంకేతిక పరికరాల ద్వారా గుర్తించారు. నిందితుడు మల్కాపురం, శాంతిగిరి కాలనీలో ఉంటున్న సాలాపు మావుళ్లుగా గుర్తించారు. అతడ్ని ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ రోడ్డులో అదుపులోకి తీసుకుని సొత్తు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితుడు స్వస్థలం విజయనగరం జిల్లా, మెరకముడిదాం మండలం, సారయివలస. నిందితులను అరెస్టు చేసి సొత్తు రికవరీ చేసిన క్రైం పోలీసులను డీసీపీ గంధం నాగన్న అభినందించారు. ఈ సమావేశంలో సీసీఎస్ శ్రావణ్, ఏడీసీపీ ద్వారకా సబ్ డివిజన్ సీఐ టి.ఇమ్మాన్యుయల్ రాజు, నార్త్ సబ్ డివిజన్ సీఐ డి.రమేష్, ఆర్ . శ్రీనివాసరావు, ఎస్ఐలు కె.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

పూలే సేవలు చిరస్మరణీయం



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ కల్యాణి,

డాబాగార్డెన్స్: సెయింట్ ఆంథోనీ హైస్కూల్ సమీపంలోని మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, వివిధ పార్టీలు, బీసీ సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బలహీన వర్గాల అభ్యుదయానికి పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని మేయర్ అన్నారు. బీసీ సంఘం నాయకుడు పితాని ప్రసాద్, పద్మావతి, రమణమూర్తి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలపై ఫిర్యాదులు రాకూడదు

మేయర్ గొలగాని హరి వెంకట కుమారి

ఆరిలోవ (విశాఖ తూర్పు) : నగరంలో వీధి దీపాల నిర్వహణపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చర్యలు చేపట్టాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి జీవీఎంసీ విద్యుత్ విభాగం అధికారులను ఆదేశించారు. ఆరిలోవ ప్రాంతం పెదగదిలి మేయర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆమె జీవీఎంసీ విద్యుత్ విభాగం ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులతో మాట్లాడుతూ డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో నగరంలో వీధి దీపాలు నిర్వహణపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలాంటి ఫిర్యాదులు ఇకనుంచి రాకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలన్నారు. వార్డు ఎమినిటీ కార్యదర్శిని, జోన్‌కు ఒక అసిస్టెంట్ ఇంజినీర్‌ను నియమించాలన్నారు. వారి పరిశీలనలో ప్రతి రోజు వీధి దీపాలు వెలిగించేలా చర్యలు చేపట్టాలన్నారు. వీధి లైట్ల నిర్వహణపై వార్డుల్లో కార్పొరేటర్లకు తెలియజేసి వారి నుంచి సక్రమంగా నిర్వహణ ఉన్నట్లు సర్టిఫికెట్లు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ రవికృష్ణ రాజు, పర్యవేక్షక ఇంజినీర్ శ్యాంసన్‌రాజు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ లక్ష్మోజీ, ఏఈలు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌కు వీడ్కోలు



రాజాబాబు దంపతులను సత్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కె.కె. రాజు, శ్రీధర్, సతీష్

అల్లిపురం: కృష్ణా జిల్లా కలెక్టర్‌గా పదోన్నతిపై వెళ్తున్న జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబును మంగళవారం నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. నగర పాలక సంస్థ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ జీవీఎంసీ కమిషనర్‌గా కొద్దికాలం పనిచేసినా నగరాభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం నగరంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌తో పాటు జీ-20 సదస్సు సమర్థవంతంగా నిర్వహించి అందరి ప్రశంసలు పొందారన్నారు. కమిషనర్ జి.రాజాబాబు మాట్లాడుతూ తనను ఇంతగా ఆదరించిన నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ అధికారులు, సిబ్బంది, నగర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, వైఎస్సార్‌సీపీ ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజు, కార్పొరేటర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం


తరుణ్ కుమార్ మృతదేహం

ఆనందపురం : మండలంలోని గంభీరం జలాశయంలో సోమవారం గల్లంతైన తరుణ్ కుమార్ మృతదేహం మంగళవారం బయటపడింది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సోమవారం మధ్యాహ్నం గల్లంతైన తరుణ్ కుమార్ ఆచూకీ కోసం పోలీసులు, గజ ఈతగాళ్లు చేసిన ప్రయత్నం ఫలించలేదు. దీంతో సాయంత్రం వెనుదిరిగిన పోలీసులు మంగళవారం ఉదయం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతోపాటు, జాలర్లు, స్థానిక యువకుల సాయంతో తరుణ్ కుమార్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం 10 : 30 గంటల ప్రాంతంలో తరుణ్ కుమార్ మృతదేహం జలాశయం నీటి అడుగుభాగంలో ఉన్నట్టు కనుకొని బయటకు వెలికితీశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో ఇద్దరు కొట్లాట

ఎంవీపీకాలనీ: మద్యం మత్తులో ఇద్దరు కొట్టుకున్నారు. ఎంవీపీకాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. అప్పుఘర్‌కు చెందిన వాసుపల్లి చిన్నా, కోరిపల్లి పవన్ అదే ప్రాంతంలోని బార్‌లో మద్యం సేవించారు. ఆ సమయంలో ఇరువురి మధ్య చోటు చేసుకున్న చిన్నపాటి వాగ్వాదం గొడవకు దారితీసింది. ఈ క్రమంలో చిన్నా.. పవన్‌ను బీరు బాటిల్‌తో కొట్టారు. అనంతరం ఇద్దరు బార్ బయటకు వచ్చి కొట్టుకున్నారు. తర్వాత మరోసారి చిన్నా పవన్‌ను కొట్టేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో పవన్ స్నేహితుడు సోమరాజు వెల్డింగ్ షాపులో నుంచి రాడ్ తీసుకురాగా.. పవన్ ఆ రాడ్‌తో చిన్నాను కొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు ఎంవీపీ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకుని కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. ఈ ఘటనలో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎంవీపీ పోలీసులు వెల్లడించారు.

హలీం.. రుచికి సలాం



రంజాన్ మాసం ప్రారంభమైందంటే చాలు ముస్లింలకు ఉపవాస దీక్షలు, ప్రత్యేక ప్రార్థనలే కాదు.. అనేక పోషక విలువలున్న హలీం గుర్తుకొస్తుంది. మాంసంతో పాటు అనేక రకాల ఆహార పదార్థాలను మిళితం చేసి గంటల కొద్దీ ఉడకబెట్టి తయారు చేసే హలీంకు ఎంతో ప్రత్యేకత ఉంది. ఉపవాస దీక్షలు జరిగే నెలరోజులు పాటు ముస్లింలే కాకుండా సాధారణ జనాలు సైతం ఈ రుచికి సలాం అంటున్నారు. ఒకప్పుడు కేవలం హైదరాబాద్‌కే పరిమితమైన ఈ వంటకం తర్వాత అన్ని ప్రాంతాలకు విస్తరించింది. మన విశాఖలో జగదాంబ సెంటర్, లీలామహల్ జంక్షన్‌తో పాటు పలు ప్రాంతాల్లో హలీం సెంటర్లు వెలిశాయి. ముఖ్యంగా హైదరాబాద్ రుచులను విశాఖ వాసులకు చూపించేందుకు అక్కడ నుంచి హలీం తయారు చేసే నిపుణులను ఇక్కడకు తీసుకొచ్చారు.

– విశాఖపట్నం డెస్క్



లీలామహల్ సెంటర్ దరిలో ఓ హలీం పాయింట్


నగరంలోని ఓ హలీం సెంటర్‌లో వడ్డన చేస్తున్న సిబ్బంది

- రంజాన్ ప్రత్యేక వంటకంగా గుర్తింపు
- వీధుల్లో వెలుస్తున్న హలీం సెంటర్లు

ముస్లింలు పవిత్ర రంజాన్ మాసంలో తెల్లవారుజాము 4 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు సుమారు 14 గంటలకు పైగా ఉపవాస దీక్షలో ఉంటారు. ఆ సమయంలో ఆహారంతో పాటు ఎటువంటి ద్రవ పదార్థాలు తీసుకోరు. ఉపవాస దీక్ష ముగించే సరికి శరీరానికి తగిన శక్తి అవసరమవుతుంది. సాధారణంగా డ్రై ఫ్రూట్స్‌తో ఉపావాస దీక్ష విరమించిన ఆ తర్వాత తీసుకునే ఆహారంలో హలీంకు ప్రాధాన్యమిస్తారు. హలీంలో మంచి పోషక విలువలతో పాటు తేలికగా జీర్ణమయ్యే గుణం ఉండడమే ఇందుకు కారణం. కేవలం సాయంత్రం లభించే హలీం రుచులను ఆస్వాదించడానికి నగర ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. ముస్లింలే కాకుండా మిగిలిన వారు కూడా ఈ రుచికి సలాం అంటున్నారు. హలీం పుట్టింది అరబ్ దేశాల్లో అయినా ప్రాచుర్యం పొందింది మాత్రం హైదారాబాద్‌లోనే అని చెప్పుకొవచ్చు. అలాంటి ఈ వంటకం నేడు అన్ని ప్రాంతాలకు విస్తరించింది. కొన్నేళ్లుగా విశాఖలో హలీం వంటకాన్ని ప్రజలకు అందిస్తున్నారు. నెల రోజుల పాటు నగరంలోని జగదాంబ, జ్యోతి థియేటర్ జంక్షన్, అక్కయ్యపాలెం, రేసపువానిపాలెం తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున స్టాళ్ల ఏర్పాటు చేసి అమ్మకాలు చేపడుతున్నారు. దీంతో పాటు మసీదుల వద్ద కూడా హలీమ్ విక్రయిస్తున్నారు.

తయారీ ప్రత్యేకమే..

సంప్రదాయక వంటలతో పోలిస్తే హలీం తయారీ ఆద్యంతం ప్రత్యేకమే. దీనికి కనీసం 8 గంటల సమయం పడుతుంది. ఇందులో మటన్ లేదా చికెన్, గోధుమలు, అన్ని పప్పులు, బాస్మతి బియ్యం, నెయ్యి, అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉల్లి, పచ్చిమిర్చి, యాలకులు, దాల్చినచెక్క, మిరియాలు తదితర 18 రకాల మసాలా దినుసులు, కొత్తిమీర, పొదీనా ఆకులు, నూనె, బాదం, పిస్తా, జీడిపప్పు తదితర డ్రైఫ్రూట్స్, ఎండు గులాబీ రేకులు, జాఫ్రాన్, సొంపు, పాలు తదితర వాటిని వినియోగిస్తారు.

ముందుగా గిన్నెలో మాంసం, నీటిని కలిపి బాగా ఉడికిస్తారు. తగిన నెయ్యి, డాల్డా తీసుకుని గరమసాలన్నీ వేయించాక.. కడిగిన గోధుమ రవ్వను సమపాళ్లలో నీరు, పాలు వేసి కలుపుతారు. ఆ మిశ్రమాన్ని ఒకే ఉష్ణోగ్రతలో ఉడికిస్తారు. అప్పటికే ఉడికిన మాసం వేసి మిశ్రమాన్ని పెద్ద తెడ్డులాంటి కర్రతో రుబ్బుతూనే ఉంటారు. ఇలా ఉదయం ఎనిమిది గంటలకు మొదలు పెడితే.. సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ ప్రక్రియ సాగుతుంది. ఆ మిశ్రమం అంతా ముద్దగా తయారై హలీంగా మారుతుంది. చికెన్‌తో అయితే మిశ్రమం తయారీకి సమయం తక్కువగా ఉంటుంది. మటన్‌తో అయితే సమయం ఎక్కుగా తీసుకుంటుంది. చికెన్ హలీంను హరీస్‌గా పిలుస్తారు. హలీం రుచికే కాదు. ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇందులోని పోషకాలు శరీరానికి మేలు చేస్తాయి. ఒక కప్పు హలీంలో 365 క్యాలరీలు, కొవ్వు నుంచి లభించే క్యాలరీలు 150 లభిస్తాయి.

కద్దూ-ఖా-ఖీర్

కద్దు–కా– ఖీర్ హలీం తర్వాత స్వీకరించే అత్యంత రుచికరమైన స్వీట్. ఆనపకాయ, సెమీయా, సగ్గు బియ్యం, పంచదారతో ఈ తియ్యని పదార్థాన్ని (పాయసం) తయారు చేస్తారు. ఉపవాస దీక్ష ఆచరించిన వారికి శరీరంలో పెరిగిన ఉష్ణోగ్రతను తగ్గించేందుకు ఈ పాయసం ఎంతో ఉపయోగపడుతుంది. కూలింగ్‌లో పెట్టుకుని.. హలీం తర్వాత ఈ స్వీట్ తింటే మధురానుభూతి పొందుతారు.

గంటల కష్టం



రుచికరమైన హలీం చేసేందుకు ఎంతో కసరత్తు చేయాలి. మాంసంలో 14 రకాల మసాలాలు, గోధుమలు కలిపి సుమారు 8 గంటల పాటు ఈ వంటకం తయారు చేస్తాం. తయారీకి ఎంత కష్టం పడినా..హలీం ప్రియులు ఈ రుచిని ఆస్వాదించినప్పుడు ఆ కష్టం మరిచిపోతాం.

– జుబేర్, హలీం పాయింట్ యాజమాని, జగదాంబ

నాణ్యతలో రాజీలేదు



అత్యంత ఇష్టకరమైన హలీం తయారీలో రాజీ పడం. హైదరాబాద్ నుంచి ప్రత్యేక వంటకాల నిపుణులను తీసుకొచ్చి తయారీ చేస్తున్నాం. హలీంలో వేసే దినుసులు నుంచి నెయ్యి వరకు నాణ్యమైన పదార్థాలను వాడుతాం.

– భాషీ, లజీజ్ పిస్తా హలీం పాయింట్ యాజమాని, లీలామహల్ జంక్షన్

రుచి అమోఘం



రంజాన్ మాసంలో లభించే హలీం రుచి అద్భుతంగా ఉంటుంది. ఈ వంట ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్యులు చెప్పడంతో.. ప్రతి సంవత్సరం కచ్చితంగా తీసుకుంటాం. హలీం రుచి అద్భుతంగా ఉంటుంది.

– అవినాష్, అల్లిపురం

ఏటా హలీం తింటాం



కేవలం రంజాన్ మాసంలో లభ్యమయ్యే హలీం అంటే మా అందరికీ చాలా ఇష్టం. ప్రతి సంవత్సరం వస్తాం. హలీం రుచులు ఆస్వాదిస్తాం. ఇది బలవర్ధకమైన ఆహారం కాబట్టే రంజాన్ స్పెషల్ డిష్‌గా హలీంకు పేరుంది.

– గౌరీప్రసాద్, మధురవాడ

శక్తివంతమైన ఆహారం

హలీం శక్తివంతమైన ఆహారం. మాంసంతో పాటు అనేక రకాల పప్పు దినుసులతో తయారు చేయడం వల్ల ప్రొటీన్లు, విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. చెక్క, లవంగాలు, ఉల్లిపాయలు ఉండటం వల్ల రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఇది అందరం తినే సంపూర్ణ ఆహారం.

– డాక్టర్ హేమచంద్ర, విశాఖ

ఊరూరా జగనన్నే మా భవిష్యత్

సాక్షి, విశాఖపట్నం: 'జగనన్నే మా భవిష్యత్'కార్యక్రమంలో భాగంగా ఐదో రోజూ ఇంటింటి సర్వే కొనసాగింది. విశాఖ జిల్లా పరిధిలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు ఆధ్వర్యంలో గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వారిచ్చిన సమాధానాలను ప్రజా మద్దతు పుస్తకంలో పొందుపరిచారు. గృహ యజమాని అనుమతితో సర్వే చేసిన ఇంటికి, మొబైల్ ఫోన్‌కు స్టిక్కర్లు అతికించారు.


59వ వార్డు లక్ష్మీనగర్‌లో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను ఇంటి గోడకు అతికిస్తున్న వై.వి.సుబ్బారెడ్డి, ఆడారి ఆనంద్


34వ వార్డు గణేష్‌నగర్‌లో చిన్నారితో ముచ్చటిస్తున్న టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి

- విశాఖ దక్షిణ నియోజకవర్గం 34వ వార్డు మనోరమ థియేటర్ జంక్షన్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.
- విశాఖ పశ్చిమ నియోజకవర్గం 59వ వార్డులో లక్ష్మీనగర్‌లో సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి హాజరయ్యారు. 59వ వార్డు హిమచల్‌నగర్‌లో ఈ కార్యక్రమం జరిగింది.
- భీమిలి నియోజకవర్గం ఆనందపురంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేజీహెచ్ ఎస్టీ సెల్ ప్రక్షాళన

- ఈ కేంద్రం పనితీరుపై కొంతకాలంగా విమర్శలు
- మొత్తం సిబ్బంది బదిలీ.. కొత్తగా 11 మంది నియామకం
- అల్లూరి జిల్లా డీఎంహెచ్‌వో నిర్ణయం

మహారాణిపేట: ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజీహెచ్‌లోని ఎస్టీ సెల్ ప్రక్షాళనకి అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఇక్కడ ఉన్న సిబ్బందిపై బదిలీ వేటు వేసి.. కొత్త సిబ్బందిని నియమించింది. కేజీహెచ్‌కు మన్యం ప్రాంతానికి చెందిన 11 మండలాల గిరిజనులు, ఉమ్మడి ఉత్తరాంధ్ర ప్రాంతం, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాలకు చెందిన గిరిజనులు వైద్యం కోసం వస్తుంటారు. నెలకు నాలుగు వేల మంది వరకు చికిత్స పొందుతుంటారు. ఈ నేపథ్యంలో గిరిజనుల బాగోగుల కోసం పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణలో గిరిజన సేవా, సమాచార కేంద్రం పేరిట కేజీహెచ్‌లో ప్రత్యేకంగా ఎస్టీ సెల్ ఏర్పాటు చేశారు. ఇక్కడ 9 మంది సిబ్బందితో సేవలు ప్రారంభించగా.. తర్వాత కాలంలో నలుగురితో నడిచింది.

సిబ్బంది ఇష్టారాజ్యం

గిరిజనుల వైద్యం కోసం ప్రభుత్వం ఎక్కువ మొత్తంలో నిధులు వెచ్చిస్తోంది. అనారోగ్యంతో వచ్చే గిరిజనులను వైద్యులకు చూపించడం, అవసరమైన పరీక్షలు, స్కానింగ్ చేయించడం ఈ సెల్ ఉద్యోగుల బాధ్యత. గిరిజనులకు భోజనాలు, మందులు, తిరిగి ప్రయాణానికి ఖర్చులు కూడా ఇవ్వాల్సిందే ఈ సెలే. కానీ ఇందుకు భిన్నంగా ఇక్కడ జరుగుతోంది. అన్ని ఉచితంగా ఇవ్వాల్సిన చోట గిరిజనుల దగ్గర నుంచి ఇక్కడ సిబ్బంది డబ్బులు తీసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరి పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు ఇటీవల జరిగిన రెండు సంఘటనలతో ఎస్టీ సెల్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. కేజీహెచ్‌లో మృతి చెందిన పసికందును సొంత గ్రామం తరలించడానికి అంబులెన్స్ ఇవ్వకపోవడంతో చిన్నారి తండ్రి బైక్‌పై తీసుకెళ్లడం, గిరిజన మహిళకు మంచం ఇవ్వకపోవడంతో రాజేంద్రప్రసాద్ వార్డులో కిందనే నిద్రించడం తదితర సంఘటనలు సంచలనమయ్యాయి. దీంతో ఎస్టీ సెల్ ప్రక్షాళనపై యంత్రాంగం దృష్టి పెట్టింది. ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్టీ సెల్ పనితీరుపై ఆరా తీశారు. కలెక్టర్ మల్లికార్జున, అల్లూరి డీఎంహెచ్‌వో తదితరులు మంత్రితో మాట్లాడుతూ ఎస్టీ సెల్‌కు అదనపు సిబ్బందిని నియమించాలని, నిధులు పెంచాలని, అంబులెన్స్‌లు సమకూర్చాలని కోరారు.


కేజీహెచ్‌లోని ఎస్టీ సెల్

సిబ్బంది బదిలీ

ఎస్టీ సెల్‌కు మొత్తం 11 మంది సిబ్బందిని కేటాయించినట్టు అల్లూరి సీతారామరాజు జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ భాషా చెప్పారు. గతంలో పనిచేసిన సిబ్బందితో పాటు సెల్ ఇన్‌చార్జి రామకృష్ణను కూడా బదిలీ చేశామన్నారు. తాజాగా ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ముగ్గురు ఎంఎన్‌వోలు, ఇద్దరు డ్రైవర్లు, సిబ్బంది ఒకరిని నియమించినట్లు వెల్లడించారు. ఈ సెల్ పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్నారు. అలాగే రెండు అంబులెన్స్‌లు కూడా కేటాయించామని అల్లూరి డీఎంహెచ్‌వో వెల్లడించారు.

మోదకొండమ్మకు నీరాజనం


కనుల పండువగా మోదకొండమ్మ ఘటాల పండగ, (ఇన్‌సెట్) ఘటాలను శిరస్సున పెట్టుకుని కాలినడకన వస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాల నాయుడు

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఘటాల పండగ మంగళవారం నేత్రపర్వంగా జరిగింది. మోదమాంబ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ఈ వేడుకను నిర్వహించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఘటాన్ని శిరస్సున పెట్టుకుని అమ్మవారి దర్శనానికి వచ్చారు. కాలనీవాసులు సుమారు వేయి ఘటాలతో డప్పులు, వాయిద్యాల నడుమ అమ్మవారి ఆలయానికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇస్మాయిల్‌కు జేఎన్‌టీయూ డాక్టరేట్


ఇస్మాయిల్ కాకరవాడ

దొండపర్తి : విశాఖ విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఇస్మాయిల్ కాకరవాడకు జేఎన్‌టీయూ అనంతపురం నుంచి డాక్టరేట్ లభించింది. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఆయన చేసిన పరిశోధనకు గాను యూనివర్సిటీ ఈ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. ప్రొఫెసర్ డాక్టర్ ఎ.మహామణి(సూపర్‌వైజర్), ప్రొఫెసర్ డాక్టర్ వి.పాండురంగడు(కోసూపర్‌వైజర్) పర్యవేక్షణలో ఇస్మాయిల్ చేసిన పరిశోధన పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా ఆయనను రీసెర్చ్ స్కాలర్స్, వర్సిటీ ప్రొఫెసర్లు అభినందించారు.

వ్యాన్ బోల్తా..డ్రైవర్ మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆనందపురం (భీమిలి) : మండలంలోని వెల్లంకి జాతీయ రహదారిపై మంగళవారం వ్యాన్ బోల్తా పడిన సంఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మారికవలసకు చెందిన డ్రైవర్ పీతల మహేష్ తగరపువలసలో ఒక షాపు నుంచి స్క్రాప్‌ను తీసుకురావడానికి వ్యాన్‌లో బయలుదేరాడు. వెల్లంకి జాతీయ రహదారికి ఒక వైపు మరమ్మతులు జరుగుతుండడంతో రోడ్డు మధ్యలో సిమ్మెంట్ దిమ్మలను డివైడర్‌గా ఏర్పాటు చేశారు. ఆ ప్రదేశంలోనే వ్యాన్ సిమెంట్ దిమ్మను ఢీకొని బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్ మహేష్ వ్యాన్ కింద చిక్కుకు పోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అందులో ప్రయాణిస్తున్న విజయనగరానికి చెందిన భాస్కర్, మారికవలసకు చెందిన మన్యాల హనుమంతు తీవ్రంగా గాయపడ్డారు. ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్ క్షతగాత్రులను తగరపువలసలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సంఘటన స్థలంలోనే మృతి చెందిన మహేష్

యువతిపై బ్లేడుతో దాడి

మెడపై స్వల్ప గాయాలు

మల్కాపురం: ఓ యువతి(17)పై రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బ్లేడ్‌తో దాడి చేసి స్వల్పంగా గాయపరిచాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. శ్రీహరిపురం గణేష్ ఆలయం అవతల రోడ్డులో ఆ యువతి, ఆమె తల్లి గౌరీ రేకుల ఇల్లులో అద్దెకు ఉంటున్నారు. యువతి తను పనిచేస్తున్న షాపు నుంచి సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి వచ్చింది. భోజనం చేసి నిద్రపోయింది. 11 గంటల ప్రాంతంలో ఇంటి బయటకు వచ్చింది. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడపై బ్లేడ్‌తో స్వల్పంగా గాయపరిచి అక్కడ నుంచి పరారయ్యాడు. దీంతో యువతి తల్లి మల్కాపురం పోలీసులను ఆశ్రయించారు. ఘటనపై పోలీసులు ఆరా తీస్తూ.. ఆ సమయంలో బయటకు ఎందుకు వచ్చావని యువతిని ప్రశ్నించారు. ఉక్కపోతతో బయటకు వచ్చానని ఆమె తెలిపింది. అనుమానితుడిగా భావిస్తూ ఓ వ్యక్తి ఫోన్ నంబర్ ఇవ్వడంతో.. పోలీసులు అతని ఫోన్ లొకేషన్‌ను గుర్తించారు. ఈ దాడికి పాల్పడింది పరవాడ ప్రాంతవాసిగా అనుమానిస్తున్నారు. అతని కోసం ప్రత్యేక బృందం గాలిస్తోంది. యువతి అక్క ఇటీవలే ప్రేమ వివాహం చేసుకుంది. యువతి తల్లి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

అప్పన్న మెట్లమార్గంలో షూటింగ్


సింహగిరి మెట్ల మార్గంలో సన్నివేశం చిత్రీకరణ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి మెట్ల మార్గంలో మంగళవారం తమిళ సినిమా షూటింగ్ సందడి నెలకుంది. నటుడు సముద్రఖనిపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. మెట్లమార్గంలో సముద్రఖని కుటుంబసమేతంగా నడిచివెళ్లి మెట్లకు బొట్టుపెట్టి హారతి ఇచ్చే సన్నివేశాన్ని చిత్రీకరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు షూటింగ్ జరిగింది.

నగరంలో నేడు

- ఉదయం 9 గంటలకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేతుల మీదుగా ఐసీడీటీ ప్రారంభోత్సవం
- ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని ఏపీఎన్‌జీవో హోం వద్ద ఏపీజేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు, పెన్షనర్ల ధర్నా

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.60,760
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.55,700
వెండి(కిలో):	రూ.80,400